నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
గురువారం | జనవరి 09, 2025 | www.navatelangana.com

ఏజెన్సీని వణికిస్తున్న చలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీని చలి వణికిస్తోంది. ఉదయం 10 దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. సాయంత్రం 4 అయితే చాలు చలి మొదలౌతోంది. చలికి తట్టుకోలేక ప్రజలు గుంపులు గుంపులుగా చలి మంటలు పెట్టుకుంటున్నారు. స్వెటర్లు వేసుకుంటున్నా చలి తీవ్రతకు మంటలు పెట్టుకుంటున్నామని స్థానికులు చెబుతున్నారు.



జాతీయ యువజన అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉమ్మడి జిల్లాలోనే జాతీయ యువజన అవార్డు అందుకున్న ఏకైక వ్యక్తి మండలానికి చెందిన తగరపు సత్తయ్యను యువజన సాంస్కృతిక క్రీడల సర్వీసుల శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ స్మితా సబర్వాల్, డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర యువజనోత్సవాలలో భాగంగా ఈ నెల 7న హైదరాబాద్‌లోని యువజన క్రీడల సర్వీసుల శాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సన్మానం అందుకున్నారు.

కళ్యాణ కానుకేదీ..?

- ఆలస్యమవుతున్న 'కళ్యాణలక్ష్మి' సాయం
- తులం బంగారం ఉత్తదేనా?
- అయోమయంలో లబ్దిదారులు
- పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-కెరమెరి

కుమార్తెల వివాహాలు చేసి ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొంది. కళ్యాణ కానుక జాడ లేకపోవడంతో ఎన్నాళ్లు పడుతుందోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి రోజు నాటికి వధువు కుటుంబానికి ఒక లక్ష, తులం బంగారం అందించాలనేది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ముఖ్య ఉద్దేశం. కానీ ఆచరణలో ఆర్థిక సాయం అందడానికి చాలా కాలం పడుతోంది. దరఖాస్తు ప్రక్రియలో నిబంధనలు, క్షేత్రస్థాయిలో విచారణ, అర్జీదారులంతా వివాహం తర్వాతే దరఖాస్తు అందజేయడం వంటి కారణాలతో ఆలస్యమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందిన దరఖాస్తులను పరిశీలించి, విచారణ పూర్తి చేసిన తర్వాత అర్హతలను ఖరారు చేసి లబ్ధిదారుల కుటుంబానికి చెక్కు రూపంలో సాయం అందించాల్సి ఉంది. ఇదంతా జరగడానికి సమయం చాలా తీసుకుంటోంది. మరో పక్క ఇప్పటికే దరఖాస్తు అందజేసిన అర్జీదారులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వారికి ఎలాంటి సమాచారం అందడం లేదు. మండలంలో దాదాపు ఏడాదిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కుల పంపిణీ జరగడం లేదు. రెండు పథకాల కింద మండల వ్యాప్తంగా 106 దరఖాస్తులు పరిష్కారానికి వచ్చి, వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలుస్తోంది.

విడుదలకాని నిధులు

మండలంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి ఏడాదిలో సుమారు 334 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దరఖాస్తులన్నీ పెండింగ్‌పడి బకాయిలు కూడా పేరుకుపోయాయి. నిధుల విడుదలలో జాప్యం కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. 2024 జనవరి నుంచి 2025 జనవరి వరకు మొత్తం 304 దరఖాస్తులు రాగా, ప్రస్తుతం కార్యాలయంలో 106 దరఖాస్తులున్నాయి. ఎమ్మెల్యే వద్ద 35 పెండింగ్‌లో ఉండగా, 8 అప్రూవ్ అయ్యాయి. ట్రెజరీలో 18 పెండింగ్‌లో ఉండగా, 107 దరఖాస్తులు ట్రెజరీలో ఆమోదం పొందాయని అధికారులు తెలిపారు.

జాడలేని తులం బంగారం

రాష్ట్రంలో గత డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు గత ప్రభుత్వ హయాంలోనే అమలులో ఉండగా ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కళ్యాణలక్ష్మి, షాదీముబాకర్ పథకాల కింద ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుతానికి పథకాలకు నిధుల విడుదల నిలిచిపోవడంతో బంగారం సంగతి సరే బకాయిల సంగతి ఏంటనే ఆందోళన, అయోమయం దరఖాస్తుదారుల్లో నెలకొంది. ఏడాదిన్నరగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లింపులు చేస్తుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం తులం బంగారం విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది.



ఈ చిత్రంలో ఉన్న మహిళ గాతడే అనసూయ. గ్రామం జైరాంగూడ. తన కూతురు వివాహం ఏప్రిల్ 21, 2024లో జరిగింది. దాదాపు 8నెలలు అవుతోంది. కళ్యాణలక్ష్మీ కానుక ఇప్పటి వరకు అందలేదు. ఎప్పుడు వేస్తారో కూడా తెలియడం లేదు. అప్పులు చేసి కూతుళ్ల పెళ్లిళ్లు చేసి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి కళ్యాణలక్ష్మీ నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ఆమె వేడుకుంటోంది.

కళ్యాణిలక్ష్మీ ఆర్థిక సాయం అందజేయాలి : చిలుముల శాంత, వాంకిడి



మాది పేద కుటుంబం. నేను రోజు వారీ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. నా కూతురు వివాహం గత జూన్‌లో జరిపించాం. అప్పులు చేసి కూతురు పెళ్లి చేశాను. అప్పులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. వివాహమై 7నెలలు గడుస్తున్నా నేటికీ కళ్యాణలక్ష్మీ ఆర్థిక సాయం అందలేదు. ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి.

కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ నిధులు విడుదల చేయాలి : మొహమ్మద్ సుజాయిత్‌ఖాన్, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు



ఏడాదిగా కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ లబ్ధిదారులకు కానుక అందక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి తమ కూతుళ్ల వివాహాలు జరిపించి ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌కు సంబంధించిన నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి.

హామీలు నెరవేర్చాలి : సెడ్మకి తుకారాం, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చింది. పేదింటి యువతుల పెళ్లిళ్లకు తులం బంగారం అందజేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైంది. ఎన్నికల్లో తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం ఊసే ఎత్తడం లేదు. ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం ఇవ్వాలి. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి.



పత్రికలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి

- పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

పత్రికలు ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యల గొంతుకగా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం నవతెలంగాణ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలోని మంచీ చెడులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడానికి పత్రికలు ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి భూమేశ్, విలేకరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంలో సీఐటీయూ ముందుంటుంది



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికుల సంక్షేమ విషయంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఎప్పుడూ ముందుంటుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికులతో ముచ్చటించారు. అనంతరం కార్మికుల కల అయిన సొంతింటి పథకం అమలు సాధ్యాసాధ్యాలను కార్మికులకు వివరించారు. అంతేకాకుండా ఎలక్షన్లకు ముందు ఆరు సంఘాలతో ఒప్పందం చేసుకున్న మారుపేరుల సమస్య మీద ఇన్కమ్ టాక్స్ వాటిపై గెలిచిన, ప్రాతినిధ్య సంఘాలు స్ట్రక్చర్ సమావేశాలలో మాట్లాడుతూ అమలయ్యే విధంగా చూడాలని తెలిపారు.


మర్సుకోల భీంరావ్ కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని వాఘాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ మర్సుకోల అశోక్ తండ్రి భీంరావ్ అనారోగ్యంతో చనిపోగా బుధవారం కుటుంబాన్ని తెలంగాణ కాంగ్రెస్ కిసాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు చంద్రశేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్, బాలే గంగన్న, సురేష్, రాజేందర్, కిరణ్ పాల్గొన్నారు.

మేరు సంఘం మహిళా కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మేరు సంఘం మహిళా కార్యవర్గాన్ని బుధవారం బీసీ సంఘం భవనంలో ఎన్నుకున్నారు. దీనికి బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, బీసీ మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పసుల రమ, ఉమామహేశ్వరి, మేరు సంఘం అధ్యక్షుడు ఎన్నావార్ రాజు, ఉపాధ్యక్షుడు ఎన్నావార్ నర్సిములు హాజరయ్యారు. మేరు సంఘం మహిళా సంఘం అధ్యక్షురాలిగా ఆత్మకూరి పద్మ, ప్రధాన కార్యదర్శిగా కర్నేవార్ సునీత, కోశాధికారిగా పోల్‌పెల్లి సుధాలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పోల్‌పెల్లి భవానీ, ఆత్మకూరి జ్యోతి, కర్నేవార్ అనసూయ, మార్శెట్టివార్ లక్ష్మి, దీకొండవార్ రాధ, కార్యదర్శులుగా పోట్‌పెల్లి నీరజ, మగ్గిడివార్ ఉమ, ఆత్మకూరి మౌనిక, ఎన్నావార్ మాలతి, పోల్‌పెల్లి సులోచన ఎన్నికయ్యారు. నిర్వాహక కార్యదర్శులుగా రామగిరి కవిత, పోట్‌పెల్లి కళ్యాణి, రేకుల్‌వార్ లక్ష్మి ఎన్నికయ్యారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

నవతెలంగాణ-లోకేశ్వరం

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన భోజారెడ్డిపై కేసు నమోదు చేశారు. మన్మద్ ఎక్స్ రోడ్ వద్ద మంగళవారం సాయంత్రం ఎస్సై అశోక్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. భోజారెడ్డి వాహనంపై రాగా ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తుండగా కానిస్టేబుల్ ప్రఫుల్‌తో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఒకరు బలి

- ప్రమాదంలో చనిపోయిన స్కూల్ బస్సు క్లీనర్
- కార్యాలయం ఎదుట కుటుంబీకుల ఆందోళన
- ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ



ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒకరి ప్రాణాలు పోయాయని ఆరోపిస్తూ జైనథ్ మండలం ఆకోలి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన నేపథ్యంలో వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ బందోబస్తు చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ నలంద కళాశాల బస్సుకు క్లీనర్‌గా ఆకోలి గ్రామానికి చెందిన గాలి గజానంద్ పని చేస్తున్నాడు. బుధవారం సోనార్ గల్లీ వద్ద బస్సు తిప్పే క్రమంలో 11కేవీ వైర్లు తాకి షాక్‌కు గురై మృతి చెందాడు. వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని కాలనీవాసులు గతంలో విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కుటుంబ పెద్ద దిక్కు ప్రాణాలు పోయాయని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.



జోగు రామన్న పరామర్శ

విద్యుత్ ప్రమాదంలో మరణించిన నలంద కాలేజీ బస్ క్లీనర్ భౌతిక కాయాన్ని మాజీ మంత్రి జోగు రామన్న సందర్శించారు. రిమ్స్ మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు విజ్జగిరి నారాయణ, వేణు యాదవ్ ఉన్నారు.



రిమ్స్ మార్చురీలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

పైలెట్ ప్రాజెక్టుగా ఆదిలాబాద్ ఎంపిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పైలెట్ ప్రాజెక్టుగా జిల్లా ఎంపికైనట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. అలాగే అర్జీల స్వీకరణ సంక్రాంతి పండుగ తరువాత ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సీఎం ప్రజావాణి జిల్లా పైలెట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో అర్జీలు స్వీకరించి ఆన్‌లైన్ చేసే డేటా ఆపరేటర్లు ఎంపీడీవోలకు రెండు రోజులపాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మిత్ర అధికారులు ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై వ్యవసాయం, రెవెన్యూ, విద్యుత్, మిషన్ భగీరథ, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి, భూమాత, తాగునీటి, పెన్షన్ తదితర శాఖలకు సంబంధించి అన్ని అంశాలతో కూడిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ వ్యవస్థను రూపొందించి అర్జిదారులకు వెంటనే రశీదు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారికి ఫార్వడ్ చేసి సమస్య ఏ స్థాయిలో ఉందో తెలిపేలా సెల్ ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. సంక్రాంతి తరువాత అర్జీల స్వీకరణ ప్రారంభించడం జరుగుతుందన్నారు. శిక్షణలో ఉదయం, సాయంత్రం వేళల్లో అవగాహన చేసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు మద్దతుగా, స్టేట్ నోడల్ అధికారి, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) నుండి సాంకేతిక సాయంతో సమర్థవంతమైన ఫిర్యాదుల నిర్వహణ కోసం ఆన్‌లైన్ పోర్టల్ అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని అందిస్తారని పేర్కొన్నారు. కిసాన్ మిత్ర, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ, సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్మెంట్, దేశ్‌పాండే ఫౌండేషన్, సఫర్ వంటి స్థానిక పౌర సమాజ సంస్థల సహకారంతో ఈ ప్రయోగాత్మక ప్రయోగం నిర్వహించబడుతోందని తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-తాండూర్

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి రూరల్ ఎస్సై అబ్జలొద్దీన్ తెలిపారు. బెల్లంపల్లి-2 టౌన్ పరిధిలో సైబర్ జాగృతి కార్యక్రమంలో భాగంగా ఎస్టీ మేరీస్ హైస్కూల్‌లో సైబర్ ద్వారా జరుగుతున్న వివిధ మోసాలను గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ప్రమేయం లేకుండా వచ్చే ఓటిపి షేర్ చేయడం, ఇంటి వ్యవహారాల్లో జాగ్రత్తతో వ్యవహరించాలన్నారు. సెల్ ఫోన్ వలన కలిగే అనర్థాల గురించి తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి-2 టౌన్ ఎస్ఐ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ వర్క్‌షాప్

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని ఐసిటి, ప్రధానోపాధ్యాయులకు మైండ్ స్పార్క్ ఆధ్వర్యంలో బుధవారం కంప్యూటర్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ వర్క్ షాప్‌ను కేబీ కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌లలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించే విధంగా మైండ్ స్పార్క్ స్వచ్ఛంద సంస్థ కంప్యూటర్ ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించింది. గిరిజన విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా మైండ్ స్పార్క్ సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేనేజర్ వికాస్ ఓవర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడి జాదవ్ వసంతరావు, ఏసియంఓ జగన్, మైండ్ స్పార్క్ బృందం సభ్యులు ఆనంద్ కుమార్, రమేష్, భీంరావు, ఆశిష్, మిలింద్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | జనవరి 09, 2025 | www.navatelangana.com

నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-భైంసా



నవతెలంగాణ పత్రిక నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నవతెలంగాణ పత్రిక చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రాజకీయాలకతీతంగా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో పత్రిక ముందుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ జడ్పీటీసీ సోలంకి భీంరావు, బీజేపీ పట్టణ అధ్యక్షులు మల్లేష్, నాయకులు సతీష్ రెడ్డి, తూమొల్ల దత్త్రాతి, భీమినేని శంకర్, మహేందర్, మహిళ మోర్చా నాయకురాలు సిరం సుష్మ రెడ్డి ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ రాష్ట్రంలో సైబర్ జాగ్రుతి దివస్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సన్‌రైస్ అకాడమీ, విజ్ఞాన్ పారామెడికల్, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ అరెస్ట్‌ల పేరుతో ప్రస్తుత సమాజంలో జరుగు నేరాలపై పూర్తి అవగాహనను విద్యార్థులకు కల్పించి చైతన్య పరిచారు. అదేవిధంగా నేరాలు జరిగే పద్ధతిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబీఉల్లా, సిబ్బంది సంతోష్, ఏసుదాస్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలున్నవారు అదృష్టవంతులు



నవతెలంగాణ-ముధోల్

ఆడబిడ్డలున్న తల్లిదండ్రులు అదృష్టవంతులని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడబిడ్డల ప్రేమ చాలా గొప్పదన్నారు. ప్రతి ఒక్కరు ఆడబిడ్డలను చదివించాలని సూచించారు. కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. దశలవారీగా అభివృద్ధి పనులను చేపడతామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీకాంత్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు నర్సాగౌడ్, సతీష్ రెడ్డి, రమేష్, శ్రీనివాస్, దత్త్రాది, రాంచందర్, భూమేష్, సుదర్శన్, శివారాం పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. జంగుబాయి ఉత్సవాలకు నిధులు కేటాయించాలని కోరారు. నెల రోజుల పాటు జరిగే జంగుబాయి ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్ల కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అదే విధంగా టైగర్ జోన్ పరిధిలో అటవీ అధికారులు చెక్ పోస్టుల వద్ద రాత్రి 9గంటల నుంచి చిన్న వాహనాలను నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం దృష్టికీ తీసుకువచ్చారు. స్పందించిన సీఎం రాత్రి వేళల్లో వాహనాలు నిలిపి వేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. వీటిపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ఎస్పీని సన్మానించిన మహిళ మోర్చా నాయకురాలు



నవతెలంగాణ-భైంసా

భైంసాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ జానకి షర్మిల గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రాంత ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు సిరం సుష్మ రెడ్డి అన్నారు. బుధవారం భైంసాలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ప్రతి బుధవారం ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో సేవలు అభినందనీయమని కొనియాడారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీ అధ్యక్షులు

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామంలో మండల కేంద్రానికి చెందిన విలేకరి గొడిసేర రాజేందర్ మాతృమూర్తి అనారోగ్యంతో ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కుచాడీ శ్రీహరి రావు బుధవారం వడ్యాల్‌లో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిరుపేద కుటుంబానికి సరుకులు పంపిణీ

నవతెలంగాణ-ఉట్నూర్



ఆపదలో ఉన్న నిరుపేదలకు ఎప్పుడు అండగా ఉంటానని దివ్య శ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారవత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన రాథోడ్ వసంత్ కుటుంబాన్ని బుధవారం దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ వనిత ప్రవీణ్ నాయక్ పరామర్శించి కుటుంబానికి నెలకు సరపడ సరుకులను అందజేశారు. మృతుడి కుటుంబానికి దివ్యశ్రీ ఫౌండేషన్ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కుటుంబీకులు అన్నారు.

రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రోడ్డు నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డిపోలో నిర్వహించిన ఈ శిబిరాన్ని కలెక్టర్ ముఖ్య అథితిగా హాజరై ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి పండ్లు, జ్యూస్ అందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా చిన్నచిన్న జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా జనవరి మాసమంత కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డ్రైవర్లు నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలన్నారు. అదే విధంగా 18 నిండని చిన్నారులు వాహనాలు నడపొద్దని, సెల్ ఫోన్ డ్రైవింగ్ చెయొద్దని సూచించారు. రోడ్డు భద్రతపై స్కూల్ విద్యార్థులతో పాటు యువకులకు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నియమాలు పాటిస్తు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం సోలోమన్, డిప్యూటి ఆర్ఎంలు ప్రవీణ్ కుమార్, ప్రణిత్, డీఎం కల్పన, డాక్టర్ కీర్తీ, ఎంఎఫ్ శ్రీకర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు వందన, పోశెట్టి, రిజార్వేషన్ ఇన్‌చార్జి ఎస్ఏ హుస్సేన్ పాల్గొన్నారు.

బ్రహ్మణ్‌గావ్ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరిస్తాం

- ఎమ్మెల్యే పవార్ రామారావు



నవతెలంగాణ -ముధోల్

గత పాలకుల నిర్లక్ష్యంతో కోట్ల రూపాయల నిధులు వృథా అయిన బ్రహ్మణ్‌గావ్ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం బ్రహ్మణ్‌గావ్ ఎత్తిపోతల పథకాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 వేల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా అప్పటి ప్రభుత్వం రూ.80 కోట్ల నిధులతో బ్రహ్మణ్‌గావ్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించినప్పటికీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో ఎత్తిపోతల లిఫ్టింగ్ పరికరాలు దొంగతనానికి గురికావడంతో రైతంగానికి చుక్క నీరు అందలేదన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశంలో శాసనసభ దృష్టికి తీసుకురావడంతో మంత్రి ఉత్త కుమార్ రెడ్డి స్పందించారని తెలిపారు. యుద్ధప్రాతిపాదికన ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో అందులో భాగంగానే రైతులతో కలిసి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమేఎం సౌకర్యాలు కావాలో రైతులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను శాసనసభ దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వం రూ. 6 కోట్ల నిధులు ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎత్తిపోతల పునరుద్ధరణయితే గన్నోరా, రువ్వి, రువ్వి తండా, బ్రహ్మణ్‌గావ్, కిర్గుల్-కె, కిర్గుల్-బి గ్రామాల్లో 6000 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నర్సాగౌడ్, ధర్మపురి సుదర్శన్, సతీష్ రెడ్డి, విఠల్ రావు, తాటివర్ రమేష్, దేవోజీ భూమేష్, లక్ష్మి నారాయణ, కిష్టారెడ్డి, రాజు, బాలాజీ, శేఖర్ సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ఉద్యమాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ఉద్యమాలు నిర్వహిస్తామని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ఎండీ అల్తాఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి హాజరై మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన జనాభా అధికంగా ఉన్న జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమన్నారు. ములుగు జిల్లాలో పేరుకే గిరిజన యూనివర్సిటీని నడుపుతుందని, పూర్తిస్థాయిలో యూనివర్సిటీని ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేరుకు మాత్రమే గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించారు తప్ప దాని అభివృద్ధి చేయడంలో విఫలమైందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యను మొత్తం కార్పొరేట్ శక్తుల కట్టబెట్ట కుట్ర చేస్తుందని తక్షణమే నూతన జాతీయ విద్యా అమలు చేయడాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. నూతనంగా అమలు చేస్తున్న మెనూను పూర్తిస్థాయిలో అమలు చేసే బాధ్యతను కలెక్టర్లకు అప్పజెప్పడం పునరాలోచించాలన్నారు. భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యావేత్తల కవితల పట్ల ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదం తిరుపతి, జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్, షేక్ అల్తాఫ్, ఖాసీఫ్, శామీర్, మాషి, నందు, రమేష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధికి రూ. 340 కోట్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎంపిక చేసుకోని అమృత్ పథకం కింద తాగు నీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.340 కోట్లు ఇచ్చారని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో రూ.కోటి 20 లక్షల టీఎఫ్ఎసీ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి శంఖుస్థాపన చేశారు. కాలనీకి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలను కౌన్సిలర్ కృష్ణయాదవ్‌తో పాటు కాలనీవాసులు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, ప్రాంతాలకు అనుగుణంగా ఆదిలాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుందన్నారు. అమృత్ పథకంలో ఎంపిక చేసి స్వచ్ఛమైన తాగు నీరు అందించడంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు నిధులు వెచ్చించి పనులు చేపట్టిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులు పెండింగ్‌లో ఉన్న వాటిని గుర్తించి ఒక్కొక్కటిగా ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వానికి విన్నవించి పూర్తి చేసేల కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ 15 సంవత్సరాల నుండి టీచర్స్ కాలనీ వాసులు రోడ్డు సౌకర్యం కోసం ఎంతో కష్టపడ్డారన్నారు. వారి కల నేరబోతుందన్నారు. అధికారులు కూడా పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రేడ్ వన్ మున్సిపాలిటిగా మారిన ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఇంకా రూ.40 కోట్ల కోసం ప్రతిపాదనాలు పంపించడం జరిగిందని అవి వచ్చిన తరువాత మిగిత కాలనీల్లో కూడా పనులు చేపడుతామన్నారు. ఇదిలా ఉంటే అటూ 170 కాలనీలో రూ.కోటి 60 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ భూమిపూజ చేశారు. కాలనీకి వచ్చిన అథితులను పుర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా పొచ్చమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సుభాష్ నగర్ కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు ముకుంద్, లాలామున్న, రవి, కౌన్సిలర్ పవన్ నాయక్, జోగు రవి, సోమ రవి, స్వామి రెడ్డి, అడెల్లు, దొంతులవార్ రమేష్ పాల్గొన్నారు.

పీడీపీవీ అమలు చేసేందుకు కేంద్రం కుట్రలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పత్తి కొనుగోళ్లలో ఇది వరకు కొనసాగుతున్న విధానాన్ని తొలగించి కొత్తగా ధర లోటు చెల్లింపు పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని ఎఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చంద్రరావు అన్నారు. బుధవారం సంఘం ప్రతినిధుల బృందం మార్కెట్ యార్డును సందర్శించి వివరాలు తెలుసుకుంది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పీడీపీవీకి నీతి అయోగ్ ఆదిలాబాద్ మార్కెట్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని, ఈ విధానంలో ప్రయివేటు వ్యాపారుల తప్ప రైతులకు ఎలాంటి న్యాయం జరగదన్నారు. ఈ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. సీసీఐ కొనుగోళ్ల కారణంగానే ప్రయివేటు దోపిడి నియంత్రణలో ఉందన్నారు. ధర లోటు చెల్లింపు పథకం అమలుతో సీసీఐ, ప్రయివేటు వ్యాపారులు కుమ్మక్కై అవినీతికి పాల్పడే అవకాశాలు పెరుగుతాయని, ఇటు రైతులకు, అటు ప్రభుత్వ ఖజానాను దుర్వినియోగం చేసే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

మెనూ అమలుపై సీపీఐ(ఎం) ఆరా



నవతెలంగాణ-తలమడుగు

హాస్టల్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హాస్టల్ మెనూ అమలు తీరుపై సీపీఐ(ఎం) నాయకులు ఆరా తీశారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని సందర్శించిన పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ విద్యార్థులతో మెనూ గురించి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల కోసం కొత్తగా తీసికొచ్చిన మెనూ అమలవుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అమలు అవుతుందని విద్యార్థులు చెప్పిన ఏ రోజు ఏమి పెట్టాలో తెలియని స్థితిలో విద్యార్థులున్న తీరు చుస్తే మెనూ అమలు తీరు అనుమాన స్పదంగా ఉందనిఈ సందర్భంగా దర్శనాల మల్లేష్ అన్నారు. అన్ని వసతి గృహాల్లో కచ్చితంగా కొత్త మెనూ అమలయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మండల కార్యదర్శి లింగాల చిన్నాన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం నిర్ణయించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత అన్నారు. బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆశా వర్కర్లకు రూ.18 వేలు నిర్ణయించాలని కోరారు. ఈ నెల 10న ఎమ్మెల్యే నివాసం ఎదుట, 21న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రకళ, కోశాధికారి రామలక్ష్మి స్రవంతి పాల్గొన్నారు.

అయోడిన్‌పై కళా ప్రదర్శన

నవతెలంగాణ-ఇచ్చోడ



ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తలమాద్రి గ్రామంలో అయోడిన్‌పై కళా ప్రదర్శన నిర్వహించారు. అయోడిన్ లోపం ద్వారా మందబుద్ధి శారీరక ఎదుగుదల లోపిస్తుందని పాటలతో అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పల్లె దవాఖాన వైద్యులు ప్రశాంత్ మాట్లాడుతూ ఆహారంలో అయోడిన్ సరైన మోతాదులో లేకపోవడం వల్ల అయోడిన్ లోపం ఏర్పడుతుందన్నారు. గాయిటర్ థైరాయిడ్ వంటి రుగ్మతలు వస్తాయన్నారు. అందుకు గర్భవతులు, పాలిచ్చే తల్లులు, పిల్లలు అయోడిన్ ఉన్న సీ విటమిన్ ఫుడ్ చేపలు, రొయ్యలు, కూరగాయలు, పాలు నాణ్యమైన పౌష్టికాహారం ప్రతినిత్యం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ రాజేష్, శశిమాల, హెల్త్ అసిస్టెంట్ సుభాష్, ఏఎన్ఎం సంగీత, విజయ, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

నూతన జీపీలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బోథ్



ఉమ్మడి బోథ్ మండలంలోని పార్డీ-బి గ్రామపంచాయతీలోని ఆదివాసీ గ్రామాలైన టివిటి పల్లె, పరుపులపల్లె గ్రామాలను ఒక గ్రామ పంచాయతీగా, అలాగే పార్డీ-కె గ్రామపంచాయతీలోని మామిడి గూడ, గొల్లాపూర్ గ్రామాలను ఒక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సీనియర్ నాయకులు గాజుల పోతన్న కోరారు. బుధవారం కలెక్టర్ రాజర్షి షా, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలతలను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి దూరంగా ఉంటున్న ఆదివాసీ గుడేలలో కనీస మౌలిక వసతులు కల్పించడానికి, ఆచార వ్యవహారాలు సంస్కృతిని కాపాడటానికి, పారిశుధ్యం పాలనలో భాగస్వామ్యం కోసం మరో 200 నూతన గ్రామపంచాయతీలు ఏర్పడనున్న నేపథ్యంలో నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్, డీపీఓ, ఎంపీడీఓలకు నూతన గ్రామ పంచాయతీల ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారన్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మేస్రం లాలు రామ్, దత్తు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని పురాతన దేవాలయం దేవరకోట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయని ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆరె చిరంజీవి, ఒడ్నం నరేందర్ పాల్గొన్నారు.

11న గురుమిలన్ దివస్

నవతెలంగాణ-ఉట్నూర్

11న గురు మిలన్ దివస్‌ను విజయవంతం చేయాలని గిరిజన లంబాడీల ఐక్యవేదిక(లైవ్) ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి బానోత్ రవీందర్ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నార్నూర్ మండలం కొత్తపల్లి-హెచ్‌లో శ్రీదీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో 11న గురు మిలన్ దివాస్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, చత్తీస్గగడ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ప్రజలు భారీగా వస్తారని తెలిపారు. కార్యక్రమంలో లైవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చవాన్ సేవాదాస్, చవాన్ అర్జున్ ఉన్నారు.

తెలంగాణ మాల మహానాడు క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలంగాణ మాల మహానాడు నూతన సంవత్సరం క్యాలెండర్లను బుధవారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు కాగజ్‌నగర్‌లో సంఘం భవనం నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు దుంద్ర శ్రీనివాస్, పెంచికల్‌పేట్ మండల అధ్యక్షులు పల్లం పురుషోత్తం, రెబ్బెన మండల అధ్యక్షుడు జూపాక అనిల్, బెజ్జూరు మండల అధ్యక్షుడు కె రాకేష్, నాయకులు నాగరాజు, రవి, మహేష్, తిరుపతి , రెడ్డి రమేష్ పాల్గొన్నారు.

నూతన బ్రాంచ్ పోస్టాఫీస్ ప్రారంభం

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని సవాతి గ్రామంలో నూతన బ్రాంచ్ పోస్టాఫీస్ కార్యాలయాన్నీ మేనేజర్ ఆర్.రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామ ప్రజలకు ఉపయోగంగా పోస్టాఫీసును ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యాలయంలో పింఛన్లు, ఉపాధిహామి డబ్బులు ఇవ్వడం జరుగుతుందని, గతంలో వాంకిడికీ వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. ప్రమాద బీమా కూడా పోస్టాఫీస్ ద్వారా కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీసీబీ బ్యాంక్ మేనేజర్ వెంకటస్వామీ, ఐపీపీడీ మేనేజర్ సాగర్, మాజీ సర్పంచ్ సోయం భీంరావ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



నవతెలంగాణ-వాంకిడి

సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ ప్రశాంత్ అన్నారు. బుధవారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ప్రతి ఒక్కరూ సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కొమురయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సైబర్ క్రైమ్ వాటి వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యవసర పరిస్థితులలో 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి కవిత, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖైర్‌గూడ మైన్‌ను సందర్శించిన నాయకులు



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ మైన్‌ను ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ సందర్శించారు. బొగ్గు బెంచ్‌లను సందర్శించి సింగరేణి కంపెనీ ఉత్పత్తి ఉత్పాదకాలను అధిగమించేందుకు బొగ్గు, ఓవర్ బర్డెన్ మట్టిని తీయడాన్ని పరిశీలించారు. పైప్ లైన్ డ్రైవర్షన్‌ను సందర్శించి పని స్థలాలలో తీసుకుంటున్న రక్షణ చర్యల గురించి కార్మికులు, సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్ బాబు, మీస చంద్రశేఖర్, కమిటీ సభ్యులు నరేష్ పాల్గొన్నారు

బాలిక కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రానికి చెందిన నిక్కాడి నగేష్ కూతురు రేష్మ అనారోగ్యంతో మరణించడంతో ఆమె కుటుంబాన్ని టీపీసీసీ మెంబర్ అర్షద హుస్సేన్ బుధవారం పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుంకరి షణ్ముఖ, జంగిటి మల్లేష్, పురం వైకుంఠం, మద్దూరి రంగన్న, ఎర్ర శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.

వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలను పాటించాలని ఎస్సై కొమురయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వాహనదారులకు పలు జాగ్రత్తలను సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలు అన్నింటిని తమతో ఉంచుకోవాలన్నారు.

చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని భరోసా సెంటర్ ఎస్ఐ తిరుమల, షి టీం సభ్యులు రమాదేవి, సునీత సూచించారు. బుధవారం కాగజ్‌నగర్ మండలం గన్నారం రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు షి టీం మరియు భరోసా సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు హింస, ఈవ్‌టీజింగ్‌కు గురైతే వెంటనే షి టీంను సంప్రదించాలని సూచించారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం లాంటి వినియోగంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమ్యకృష్ణ, భరోసా సెంటర్, షిటీం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా మూత్రశాలల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో చేపడుతున్న ప్రజా మూత్రశాలల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో చేపడుతున్న మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎస్ఎస్ క్లీన్ అండ్ గ్రీన్ సేవా సంతస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ పనులను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలను శుభ్రంగా ఉంచడంలో భాగంగా స్వచ్ఛందసంస్థ మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మూత్రశాలల నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. వ్యాపారులకు, మార్కెట్‌కు వచ్చే ప్రజలకు ఇవి సౌకర్యంగా ఉంటాయని అన్నారు. ఈ నెల 26వ తేదీ నాటికి పనులు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఈజ్‌గాం నజ్రుల్‌నగర్‌లో సోలార్‌ప్లాంట్ స్థల పరిశీలన చేసే స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటలతో మానసికోల్లాసం : ఆర్‌ఎస్పీ



నవతెలంగాణ-చింతలమానేపల్లి

యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రవీంద్ర నగర్-1 గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. యువతలో ఉత్తేజితం నింపడానికి ఆర్ఎస్పీ బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా క్రీడలు, ఉన్నత చదువులు, ఉద్యోగ సాధనలపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, ఇలాంటి క్రీడల్లో పాల్గొన్నప్పుడే వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉన్నత స్థానాలకు చేరేందుకు, ఉద్యోగ సాధనలో ఉన్న అభ్యర్థులకు కష్టపడి, వారివారి గోల్స్‌లను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ బిస్వాస్, నక్క శంకర్, ఆవుల రాజకుమార్, కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలో పాపన్నపేట గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సరదాగా క్రికెట్ ఆడారు. ఎంత ప్రతిభలో ఉన్నప్పటికీ పట్టణ ప్రాంత క్రీడాకారులకు ఉండే సౌకర్యాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండవని క్రీడలను ప్రోత్సహించాలని ముందుకు వచ్చిన పాపన్నపేట యూత్ కన్వీనర్ దుర్గం తిరుపతిని అభినందించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు బూస సారయ్య, బీఆర్ఎస్ కన్వీనర్ కొండ రాంప్రసాద్, నాయకులు ఎంఎ సలీం, రాజ్ కుమార్, నరేందర్, ఖాజా మైనోద్దీన్, కుమ్మరి శ్రీనివాస్ కొండయ్య, బాబురావు పాల్గొన్నారు.



మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-రెబ్బెన



ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం మండలంలోని నంబాల గ్రామంలో గల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. తాగునీరు మూత్రశాలల సౌకర్యాలపై హెచ్ఎంని వివరాలు అడిగి తెలుసుకొని అదనపు బోరు మంజూరు చేయాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంలో భాగంగా పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. వార్షిక పరీక్షల ఫలితాలలో జిల్లాను ముందంజలో ఉంచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం నంబలా గ్రామంలో సోలార్ ప్లాంట్ భూమి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసిల్దార్ రాంమోహన్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా భీమ దేవర జెండా పండుగ వేడుకలు



నవతెలంగాణ-కౌటాల

ఆదీవాసీ కొలావార్ సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బ బాపు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో భీమ దేవర జెండా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలవార్ కులస్తులు వెనుకబడి ఉన్నారని ఐకమత్యంగా ఉంటే మన అన్ని హక్కులను సాధించుకోవచ్చని తెలిపారు. వర్గాలు ఏర్పరచుకొని విడిపోతే నష్టపోతామని అలాంటి వాటికి తావివ్వకుండా ఐకమత్యంగా ఉండి పోరాటి హక్కులను సాధించుకుంటున్నామని తెలిపారు. అదే విధంగా మండలంలోని గురుడుపేట్ గ్రామంలో జెండా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, కొలావార్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో ఆదివాసీ కొలావర్ సంఘం ఆధ్వర్యంలో భీమదేవర జెండా పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బెజ్జూరు గ్రామంలో లక్ష్మీదేవర ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసి కొలవార్ నాయకులు మేడి సతీష్, పోల్క వెంకటేష్, పెద్దల శంకర్, పెద్దల వెంకటి, మల్లేష్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ మండలం వంజిరిలో బుధవారం 23వ భీమదేవర జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జెండావిష్కరించారు. గ్రామస్థులు కమ్మరి రవి, దుర్గం కమలక్క ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జెండా పండుగలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పిట్టల రామస్వామి, నాయిని యాదగిరి, సిడం హన్మంతు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ బౌద్ధ ధమ్మ ధ్వజ్ దివస్

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో 145వ ధమ్మ ధ్వజ్ దివస్ ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ 08 జనవరి 1880లో శ్రీలంకలో నిర్వహించిన ధర్మ సభలో ఆర్‌డీ సిన్హా ధమ్మ ధ్వజాన్ని తయారు చేశారన్నారు. 1885లో వైశాఖ పౌర్ణమి రోజున కొలంబో సమితి ఈ ధమ్మా ధ్వజాని ప్రపంచ వ్యాప్తంగా ఎగురవేశారనీ తెలిపారు. కార్యక్రమంలో మండల భారతీయ బౌద్ధ మహా సభ అధ్యక్షులు జయరాం ఉప్రే, బౌద్ధ ఉపాసక్ పాండు జాడే, బుద్ధ భూమి వ్యవస్థాపక అధ్యక్షులు గేడామ్ శిరీషన్, బౌద్ధ సమాజ్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, బౌద్ధ, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దుర్గం హంసరాజ్, రోషన్ ఉప్రే, దుర్గం శ్యామ్ రావ్, దుర్గం సందీప్,దుర్గం డిలాజి,దుర్గం మనోజ్, ఉప్రే బాల్వంత్, ఉప్రే రాజేశ్వర్ పాల్గొన్నారు.



చదువుతోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-రెబ్బెన

చదువుతోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరూ వారి కుటుంబంలో పిల్లలను పాఠశాలకు పంపించాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండలంలోని కొలం గూడ గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా పేద ఆదివాసీ మహిళలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసులు చదువుపై ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యువత మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించి తమ కుటుంబాల అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. రైతులు దళారుల మాయమాటలు నమ్మి మోసపోకుండా గంజాయి పండించడం, సేవించడం, అమ్మడం లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రెబ్బన్న సీఐ బుద్దే స్వామి, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలోని లబ్దిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పంపిణీ చేశారు. మొత్తం 29 మంది లబ్దిదారులకు మంజూరు కాగా వీటిని ఆయన అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, డిప్యుటీ తహసీల్దార్ సరిత, ఆర్ఐలు సంధ్యారాణి, సిద్దార్థ పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ ఆత్మగౌరవ దినోత్సవం



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామంలో బుధవారం 23వ ఆదివాసీ ఆత్మగౌరవ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ జెండాను ఆవిష్కరించి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మన్నేవార్ సేవా సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు కోడిపె నవీన్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. స్వాతంత్రం వచ్చి 75 వసంతాలు పూర్తి చేసుకున్న ఆదివాసుల జీవితాల్లో మాత్రం అభివృద్ధి కానరావడం లేదన్నారు. నేటికి కూడా రాజ్యాంగ ఫలాలు ఆదివాసులకు దక్కడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులు హక్కులను కాలరాస్తున్నాయని, వాటిని తిప్పికొడుతూ ఏకమై హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మన్నెవార్ సేవా సంఘం నాయకులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు శిక్షకుల ఎంపికకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వృత్తి విద్య కోర్సుల శిక్షకుల ఎంపికకు గురువారం జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యోగా, డీటీపీ, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర కోర్సులు బోధించేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 11 గంటలకు సబంధిత సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు.

అటెండరు పోస్టుకు దరఖాస్తులు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో అటెండర్ పోస్టు (1) ఖాళీగా ఉందని ఎంఈఓ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన మహిళ ఉండి పదవ తరగతి ఉత్తీర్ణత ఉన్నవారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి కలవారు పదవ తరగతి మెమో, బోనోఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్, బయోడేటా ఫారంతో ఈనెల 10 లోపు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్ పోస్టులు పీఈటీ, హిందీ, గణితం మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రత్యేక అధికారిణి కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా అయి ఉండాలని, పీఈటీకి విద్యార్హత డిగ్రీ, బీపీఎడ్, గణితంకు విద్యార్హత డిగ్రీ బీఎడ్ ఉత్తీర్ణత, హిందీకి ఎంఏ హిందీ, హెచ్‌పీటీ, టెట్ అర్హత గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి కలవారు అన్ని స్టడీ సర్టిఫికెట్ మెమో, బోనాఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ బయోడేటా ఫారంతో ఈనెల 10 లోపు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాల మోడీలో అతిథి అధ్యాపకుల(సీఆర్టీ) ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారిని జి. ప్రవీణ ఒక ప్రకటన లో తెలిపారు. హిందీ, ఇంగ్లీష్, కెమిస్ట్రీ, తదితర సీఆర్టీ ఖాళీల భర్తీ కోసం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా భర్తీ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కేజీబీవీలో సంప్రదించాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | జనవరి 09, 2025 | www.navatelangana.com

అక్రమంగా ఆవులను తరలిస్తున్న ట్రాలీ పట్టివేత

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మహమ్మద్ ఖాన్ అనే వ్యక్తి (టీఎస్18 టీ 4723)ట్రాలీలో ఎలాంటి రసీదులు లేకుండా రెండు ఆవులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. పట్టుకున్న ఆవులను గోశాలకు తరలించి, మహమ్మద్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి రసీదులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెండు తలల పామును తరలిస్తూ పట్టుబడిన నిందితులు

నవతెలంగాణ-జైపూర్





చెన్నూర్ మండలం చింతలపల్లి శారుల్లో రెండు తలల పామును చెన్నూర్ డివిజ్ ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.. మహారాష్ట్ర నుండి రెండు తలల పామును తరలిస్తున్న వారిని బుధవారం అటవీ అధికారులు పట్టుకున్నారు. ఈ పామును తరలిస్తున్న వారిలో మహారాష్ట్రకు చెందిఇద్దరు, తెలంగాణకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

కంటి వైద్యం చేయించుకున్న వారికి పండ్ల పంపిణీ



నవతెలంగాణ-కాసిపేట

కంటి వైద్యం చేయించుకున్న వారికి లయన్స్ క్లబ్ మంచిర్యాల గౌతమి ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ చేశారు. ఉచిత నేత్ర వైద్య శిబిరానికి హాజరై చికిత్స చేయించుకున్న వారిని కాసిపేట గ్రామంలో పరామర్శించి వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల్ గౌతమి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ వీ రాజేంద్రప్రసాద్, లయన్ లేడీ మంజుల, అట్టపెల్లి శ్రీనివాస్ సుమలత, పూస్కూరి విక్రమ్ రావు, నాంసాని రాజకుమార్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలకు నిధులు విడుదల చేయాలి



నవతెలంగాణ-తాండూర్

మండలంలో అసంపూర్తిగా ఉన్న మన ఊరు మనబడి అమ్మ ఆదర్శ పాఠశాలలకు వెంటనే నిధులను విడుదల చేయాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు పట్టూరి వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస్ ఎంఈఓ మల్లేశం జడ్పీహెచ్ఎస్ రేచిని పాఠశాలను సందర్శించిన సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను వివరించారు. అధికారులు విద్యార్థులను పాఠశాలలోని వసతుల గురించి అడిగి తీసుకున్నారు. అనంతరం ఎస్టీయూటీఎస్ క్యాలెండర్ విడుదల చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఎం ప్రదీప్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు బగ్గని రవికుమార్, రత్నయ్య బి రవిబాబు, పి శ్రీనివాస్, కిష్టాగౌడ్, పీడీ సంతోష్, సుకుమాంజలి, నాగమణి, ఎలిజబెత్ రాణి, శ్రీలత కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని శివాజీ గ్రౌండ్‌లో గురుస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని అజనీపుత్ర చైర్మన్ గుర్రాల శ్రీధర్ అన్నారు. క్రికెట్ పోటీలు ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడాకారులకు రూపొందించిన టీషర్ట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుగుస్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రిమియర్ లీగ్ సీజన్-2 క్రిట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ నెల 16వ తేది వరకు నిర్వహించే క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి రవి పాల్గొన్నారు.

ఫోర్‌మెన్‌ను సన్మానించిన ట్రైనీ ఎలక్ట్రికల్ అభ్యర్థులు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ వీటీసీ కార్యాలయంలో బుధవారం ట్రైనీ ఎలక్ట్రికల్ అభ్యర్థులు ఫోర్ మెన్ అశోక్‌ను ఘనంగా సన్మానించారు. ఎలక్ట్రికల్ ట్రైనింగ్ చేస్తున్న అభ్యర్థులకు 24 రోజులలో అన్ని విధాల సర్క్యూట్స్, ప్రాక్టికల్ వర్క్స్ గురించి పూర్తిస్థాయిలో అభ్యసన చేయడం ద్వారా సన్మానించినట్లు అభ్యర్థులు తెలిపారు. టెక్నికల్ అభ్యర్థులు సంస్థకు చాలా కీలకమైన వ్యక్తులని ఈ సందర్భంగా ఫోర్ మెన్ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సదానందం, వెంకటేష్, మహేంద్రచారి, శీను, రణదీప్ పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై చర్చించాలి

- సింగరేణి డైరెక్టర్‌ను కలిసిన బీఎంఎస్ నాయకులు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సింగరేణియాజమాన్యం చర్చించాలని బీఎంఎస్ నాయకులు కోరారు. ఈ సంధర్బంగా బుధవారం గోదావరిఖని పట్టణంలోపి సింగరేణి అతిథి గృహంలో కలిసి వినతీ పత్రం అందజేశారు. 2024 డిసెంబర్ 17న డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమీషనర్ ఎదుట ప్లాంట్ యాజమాన్యంతో కుదిరిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మెమోరాండం ఆఫ్ సెటిల్‌మెంట్ ఒప్పందం ప్రకారం ప్లాంట్‌లో క్యాంటీన్ సదుపాయం కల్పించడంతో పాటు సబ్సీడీపై ధరలతో కొనసాగించాలని లేబర్ కమీషన్ ఎదుట ఒప్పందం కుదిరిందని అన్నారు. అదేవిధంగా పవర్‌ప్లాంట్ ఏర్పాటులో భూములు నష్టపోయిన నిర్వాసిత కుటుంబాలకు సముచిత ఉద్యోగం కల్పించడం, ప్లాంట్ కార్మికుల్లో అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించడానికి యాజమాన్యం అంగీకరించిన తీరును గుర్తు చేశారు. కార్మికుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలన్న విజ్ఞప్తి పట్ల స్పందించి వెంటనే బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్న వారికి అర్హతకు తగ్గట్టుగా పదోన్నతులు వెంటనే కల్పించాలని కోరారు. ప్లాంట్‌లో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదాలకు గురై మృతి చెందిన వారి కుటుంబాల్లో ఎవరికైనా ఒకరికి సూటెబుల్ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, బోడకుంట శ్రీధర్, శివకృష్ణ, చిలకాని వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ఏజెండాగా పని చేస్తాం



నవతెలంగాణ-తాండూర్

ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలే ఏజెండాగా పనిచేస్తామని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని 15వ వార్డ్‌లోని పలు కాలనీలల్లో పాదయాత్ర నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంలో 15వ వార్డ్‌లోని గృహావసరాలకు సింగరేణి యాజమాన్యం విద్యుత్ సరఫరా నిలిపివేసిందన్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బస్తీలో పర్యటించారు. మాజీ కార్మికుల ఇండ్లకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి యాజమాన్యంతో కొట్లాడైనా విద్యుత్తు పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు. తాను పదవిలో లేనప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. స్థానికుడిగా నియోజకవర్గంలో ఎక్కడ సమస్య తలెత్తితే అక్కడ వాలిపోతానని సమస్యలే ఏజెండాగా ప్రజల కోసం పని చేస్తానన్నారు. ప్రజలు కార్యకర్తలు అధైర్యపడవద్దని తెలిపారు. రామగిరి లావణ్య, బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ రామగిరి లావణ్య, పట్టణ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ అలిభాయ్, పట్టణ యూత్ అధ్యక్షుడు సబ్బని అరుణ్, మైనార్టీ టౌన్ జనరల్ సెక్రెటరీ కలీం పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు



నవతెలంగాణ-మందమర్రి

బడికి వెళ్లాల్సిన పసి పిల్లలను పని పిల్లలుగా మారుస్తున్న వారికి కఠిన శిక్షలు తప్పవని బెల్లంపల్లి సబ్ డివిజన్ అదనపు ఎస్ఐ నూనె శ్రీనివాస్ హెచ్చరించారు. పోలీసుల ఆధ్వర్యంలో జనవరి 31 వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బుధవారం మార్కెట్ ప్రాంతంలోని దుకాణాలలో బెల్లంపల్లి సబ్ డివిజన్ అదనపు ఎస్ఐ నూనె శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణ సముదాయాలలో మైనర్ బాలలను పనిలో పెట్టుకోకూడదని, పసి పిల్లలతో పనులు చేపిస్తూ వ్యాపారాలు చేస్తున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులలో భాగంగా పనులకు వెళ్తున్న పిల్లలను గుర్తించి పాఠశాలకు పంపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యాలయాలకు దూరమై కూలి పనులకు వెళ్తున్న బాలలను గుర్తించి ఇద్దరిని తంగళ్ళపల్లి పాఠశాల, నలుగురిని రామకృష్ణాపూర్ పాఠశాలలో చేర్పించామన్నారు. దేశానికి భరోసానందించే పసిపిల్లలు స్కూలుకు వెళ్లకుండా పనికి వెళ్తున్న వారిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 112 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

సైబర్ దివస్ డిజిటల్ అరెస్టుపై అవగాహన



లక్షెట్టిపేటలో..

నవతెలంగాణ-లక్షెట్టి పేట

పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ దివస్ డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా లక్సెట్టిపేట ఎస్ఐ-2 రామయ్య మాట్లాడుతూ ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ఎక్కువగా ప్రజలు మోసపోయి చాలా డబ్బులు పోగొట్టుకున్న డిజిటల్ అరెస్టుకు సంబంధించిన సైబర్ క్రైమ్ ఎలా జరుగుతుంది ప్రజలు ఎలా మోసపోతున్నారు అనే దానిపై వారికి వివరించారు. అంతే కాకుండా సైబర్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 ఇంపార్టెంట్స్ పై తెలిపారు. ఆన్‌లైన్ మోసాలపై అడ్డుకట్ట వేసేందుకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని, సెల్ ఫోన్ వినియోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. క్రెడిట్/డెబిట్ కార్డ్ నంబర్‌లు, పాస్‌వర్డ్‌లు, మొదలైన వ్యక్తిగత వివరాలను అందించడానికి మోసగాళ్లు బాధితులకు మాయ మాటలు చెప్తారు ఎవ్వరికి చెప్పకూడదు అని తెలిపారు.



దండేపల్లిలో..

దండేపల్లి : సైబర్ నేరాల్లో ప్రస్తుతం డిజిటల్ అరెస్టు మోసాలు ఎక్కువ అవడంతో అప్రమత్తమైన పోలీస్ శాఖ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో స్థానిక ప్రజలకు సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేరగాళ్లు ఫోన్ చేసి మీ పిల్లలపై కేసుందని డిజిటల్ అరెస్ట్ చేస్తామనేటప్పుడు సమీపంలో పోలీసులను సంప్రదించాలని సూచించారు.



జైపూర్‌లో..

జైపూర్ : ప్రస్తుత సమాజంలో జరుగుతున్న డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహణ కలిగివుండాలని భీమారం ఎస్ఐ శ్వేత అన్నారు. భీమారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ బాలుర వసతీ గృహం విద్యార్థులతో సమావేశమయ్యారు. సైబర్ జాగృతి దివస్‌ను పురస్కరించుకుని డిజిటల్ అరెస్టులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో స్థానిక పోలీస్ సిబ్బంది, వసతీ గృహం నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మడుల్లో కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలి

- ఏడీఏ బానోత్ ప్రసాద్



నవతెలంగాణ-మందమర్రి

వరి పొలం మడుల్లో కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ రైతులకు సూచించారు. బుధవారం పులిమడుగు గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ మాట్లాడుతూ వరి పొలం మడుల్లో ప్రతీ 2 మీటర్లకు 20 సెంటిమీటర్లతో కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా వరి పైరుకు గాలి వెలుతురు బాగా తగిలి ఏపుగా పెరుగుతుందని, చీడ పీడలు, దోమ పోటు అదుపులో ఉంటుందని అన్నారు. పైరుకు ఎరువులు వేయడానికి పురుగు మందుల పిచికారీకి సౌకర్యవంతంగా ఉండటంతో పాటు పైరును పరిశీలించడం తేలిక అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జి కిరణ్మయి, విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, కనకరాజులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

పేకాట, కోడిపందాలు ఆడితే కఠిన చర్యలు

- హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేష్



నవతెలంగాణ-హాజీపూర్

పేకాట, కోడి పందాలు ఆడితే చర్యలు తప్పవని హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేష్ హెచ్చరించారు. గతంలో ఇలాంటి పందాలు ఆడిన వారిని బుధవారం తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎలాంటి జూదాలు లాంటి ఆటలు ఆడినట్లైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ విషయమై పెద్దంపేట్ గ్రామంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తె ఎలాంటి ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. సైబర్ మోసాల పై అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఐఎన్‌టీయూసీ యూనియన్ బాయిబాట



నవతెలంగాణ-మందమర్రి

ప్రాతినిధ్య ఐఎన్‌టీయూసీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏరియా వర్క్ షాప్‌లో బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య మాట్లాడుతూ పనిముట్ల కొరత, కన్వేయన్స్ సదుపాయాలు సరిగ్గా లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికుల సొంతింటి కల, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ మాఫీకై నాయకులు జనక్ ప్రసాద్ కృషి చేస్తున్నారని తెలిపారు.

మార్చి 31 వరకు విద్యుత్తు పునరుద్ధరణ

నవతెలంగాణ-తాండూర్

తొలగించిన విద్యుత్తు కనెక్షన్లను మార్చి 31 వరకు పునరుద్ధరించే విధంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ చర్యలు తీసుకున్నట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడారు. కార్మికుల క్వార్టర్లకు గతంలో సింగరేణి యాజమాన్యం విద్యుత్ సరఫరా నిలిపివేస్తే ఎమ్మెల్యే వినోద్ సంస్థ సీ అండ్ ఎండీతో మాట్లాడి విద్యుత్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. రెండు రోజుల కిందట సింగరేణి అధికారులు బెల్లంపల్లి పట్టణంలోని కార్మికుల క్వార్టర్లకు విద్యుత్ కనెక్షన్లను తొలగింపు విషయమై సీఎండీ, మందమర్రి జీఎంలతో మాట్లాడి మార్చి 31 వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు సింగరేణి జీఎంతోపాటు విద్యుత్తు అధికారులు అంగీకరించినట్లు ఆయన తెలిపారు. అబద్ధపు మాటలతో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రజలకు దగ్గర అవ్వాలని చూస్తున్నారని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై అబద్ధపు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

అనుమతి లేని లేఅవుట్‌లో నిర్మాణాలు తగదు

నవతెలంగాణ-జైపూర్

డీటీసీపీ అనుమతి పొందనటువంటి లేఔట్‌లలో నిర్మాణాలకు అనుమతి లేదని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలో ఎల్ఆర్ఎస్ సర్వే చేపట్టిన ప్లాంట్లను ఆయన పరిశీలించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలో ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులు చేసుకున్న వారు తక్షణమే మీకు సంబంధించిన ప్లాట్ల సర్వే కోసం స్థానిక పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని కోరారు. ఎల్ఆర్ఎస్ స్కీం ద్వార ధరఖాస్తులు చేసుకున్న వారు నిర్లక్ష్యం చేసుకోకుండా మీకు చెందిన ప్లాట్లను సర్వే చేయించుకోవాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | జనవరి 09, 2025 | www.navatelangana.com

చైనా మాంజాతో పర్యావరణానికి హాని

నవతెలంగాణ-జన్నారం



చైనా మాంజాతో పర్యావరణానికి హాని జరుగుతుందని జన్నారం అటవీ అధికారులు అన్నారు. సంక్రాంతి సందర్భంగా జన్నారం మండల కేంద్రంలోని చైనా మాంజాను విక్రయించకుండా పలు దుకాణాలను తనిఖీ చేశారు. చైనా మాంజాతో పక్షులకు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని స్పష్టం చేశారు. చైనా మాంజాను ఎవరూ కూడా విక్రయించ వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ తిరుపతి ఎఫ్‌బీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-దండేపల్లి



మండల కేంద్రానికి చెందిన మంద రాజు, జిల్లపల్లి పవన్ కళ్యాణ్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబాలకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అండగా నిలిచారు. మృతుల కుటుంబాలకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కటుకురి రాజన్న, బండ రాకేష్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సిరికొండ నవీన్,కుమ్మరి సతెన్న,కసనగొట్టు శేకర్ , బొమ్మెన గోపి,గంగాధర్, తోట్ల ఉదయ్, అజీజ్, జిల్లపెల్లి వెంకటేష్, గుర్రం బాపు, దుంపల మురళి, సురేష్ పాల్గొన్నారు.

పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



నవతెలంగాణ-జన్నారం

రానున్న పబ్లిక్ పరీక్షల్లో పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మంచిర్యాల డీఈఓ యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని పీఎస్ కొత్తపేట యూపీఎస్, ఇంధన్‌పల్లి, కిష్టాపూర్‌లోని కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అలాగే పాఠశాల తరగతుల్లోని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే పబ్లిక్ పరీక్షల్లో ప్రతి పాఠశాల నుంచి 100 శాతం ఉత్తీర్ణతతో పాటు 10/10 జీపీఏ సాధించాలని, విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్ కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఉన్నారు.

11 నుంచి టీసీసీ పరీక్షలు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు పరీక్షల నిర్వహణకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గర్మిళ్ళ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హైయర్ గ్రేడ్ పరీక్షలు జనవరి 11, 12, 16, 17 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంల వరకు, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, లోయర్ గ్రేడ్ పరీక్షలు 11వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ హైయర్ గ్రేడ్ పరీక్షలు 12వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఎస్ఈ.తెలంగాణ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు.

గిరిజన పాఠశాల ఉపాధ్యాయుడు సస్పెన్షన్

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మల్యాల గిరిజన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు అజ్మీర లక్ష్మణ్ నాయక్‌ను ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారనే అభియోగం మేరకు ఆయనను సస్పెండ్ చేసినట్లు నిర్మల్ డీటీడీఓ, మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి జాదవ్ అంబాజి బుధవారం తెలిపారు. అతను విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, దీంతో గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆ గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, గ్రామ పెద్దలు ఉమ్మడి జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పీఓకు ఇటీవల పిర్యాదు చేశారు. ఈ మేరకు అతన్ని సస్పెండ్ చేశారు. గిరిజన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సక్రమంగా విధులకు హాజరుకావాలని సూచించారు.

ఉదారత చాటుకున్న మాజీ ఉప సర్పంచ్



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ మండల కేంద్రలో గల ఇందిరమ్మ కాలనీలో తాగు నీటి సమస్యను గుర్తించిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు మాజీ ఉప సర్పంచ్ అంబాల సంపత్ రెడ్డి స్వంత ఖర్చులతో మూడు బోరు మోటార్లు కొనుగోలు చేశారు. స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఇందిరమ్మ కాలనీలో బోరు మోటార్లు పునరుద్దరించి నీటి సరఫరాను పున:ప్రారంభించారు .ఇందిరమ్మ కాలనీవాసుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బోరు బావులకు సంబందించిన విద్యుత్ మోటార్లు చెడిపోవడంతో అక్కడ తాగు నీటి సమస్య ఏర్పడింది. మూడు విద్యుత్ మోటార్లు స్వంత డబ్బులతో కొనుగోలు చేసి కాలనీలో ఏర్పడిన నీటి సమస్యకు పరిష్కారం చూపించినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మన్, అంబాల రవి, చీనూరి మధూకర్ రెడ్డి, ఇరిగిరాల లింగయ్య, ప్రశాంత్ రెడ్డి, అరిగెల శ్రీనివాస్ గౌడ్, విజయరావు తదితరులు పాల్గొన్నారు..

కిష్టంపేటలో భీమన్న జెండా పండుగ

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ మండలం కిష్టంపేట గ్రామంలో 23వ భీమన్న జెండా పండుగను పురస్కరించుకొని కొలవార్ సమాజా ఆచార వ్యవహారాలను పాటిస్తూ బుధవారం భీమన్న దేవరా జెండా పండగను జరుపుకున్నారు. ఆట పాటలతో నృత్యాలతో, మూగ డోలు వాయిద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ కొలవార్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండిగ రవీందర్, కొలవార్ సేవా సంఘం ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు బర్ల శంకర్-వనజ, కిష్టంపేట మాజీ సర్పంచి గడ్డం మహేశ్వర్, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపుల పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



44వ నెంబర్ జాతీయ రహదారి వెంట ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వరకు ఉన్న ప్రమాదకర మలుపులను బుధవారం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రీజినల్ మేనేజర్ శివశంకర్ పరిశీలించారు. సర్వీసు రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానించే క్రమంలో జరిగిన నిర్మాణ లోపాలపై గతంలో ఎంపీ గొడం నగేష్, ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులను కలిసి వివరించారు. ఈ నేపథ్యంలో సంస్థ రీజినల్ మేనేజర్ శివశంకర్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, ఎంపీ గొడం నగేష్‌తో కలిసి ప్రమాదకర మలుపులను పరిశీలించారు. గుడిహత్నూర్, కడ్తాల్, మావలతో పాటు ఆదిలాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్లే మార్గంలో చాంద సమీపంలో వాహనదారులు జాతీయ రహదారిపైకి చేరడంలో పడుతున్న ఇబ్బందులును పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న పరిస్థితులు, నిర్మాణ లోపాలు, ఎలాంటి సర్దుబాట్లు అవసరం అనే కోణంలో విచారణ జరిపారు. గ్రామాల నుంచి జాతీయ రహదారికి వస్తున్న వాహనదారులు కొద్ది దూరం పాటు అపసవ్య దిశలో ప్రయాణించాల్సి వస్తున్న ప్రాంతాలను గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. వారి వెంట టీమ్ లీడర్ ప్రసన్నకుమార్, మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, తులసీరామ్, తిరుపతి, గంగాధర్, గాదె శంకర్ ఉన్నారు.

ఇంటి వద్దే పురుడు పోసిన 108 సిబ్బంది



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోనాపూర్ నాయకపుగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ కనక మౌనికకు పురిటి నొప్పుల రావడంతో ఇంటి వద్దే 108 సిబ్బంది పురుడు పోశారు. ఆడ శిశువుకు జన్మనిచ్చిన ఆమె బిడ్డతో ఆరోగ్యంగా ఉన్నారని ఈఎంటీ దుర్గం ఆత్మారావు, పైలెట్ ఎండీ అసద్ పాషా తెలిపారు. మౌనికకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గ్రామానికి చేరారు. అప్పటికే అధిక నొప్పులతో బాధ పడుతున్న బాలింతను 108లో ఎక్కించే పరిస్థితి లేకపోవడంతో ఈఆర్సీపీ వైద్యుని సలహాల మేరకు ఇంటి వద్దనే డెలివరీ చేశారు. అనంతరం కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

టీఎన్జీవో సభ్యత్వ నమోదు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు సంద అశోక్ అన్నారు. బుధవారం టీఎన్జీవో కార్యాలయంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారులకు సభ్యత్వ రశీదులను అందజేశారు. వసతి గృహ సంక్షేమ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులందరూ సంఘటితమై ఉద్యోగుల హక్కుల సాధన కోసం కృషి చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షులు జె.నర్సిములు, కార్యదర్శి శ్రీనివాస్, ఓం ప్రసాద్, సుజాత, రాధ, రవి, దత్తు, జయమ్మ, శివ, ఫర్వేజ్, చిన్నయ్య, సంధ్య ఉన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి : ఆర్డీఓ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాలను బుధవారం ఆర్డిఓ వినోద్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలని తెలిపారు. క్రమం తప్పకుండా మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలని, కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రమీల, ఆర్ఐలు నాగోరావు, సాయిరాం, అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఆడే గజేందర్

నవతెలంగాణ-నేరడిగొండ

పల్లెల అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని గాజిలి గ్రామంలో గ్రామస్తుల కోరిక మేరకు పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం తెలంగాణలోని అన్ని పల్లెలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి గ్రామాలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో పేద ప్రజలకు రూ.5లక్షలతో త్వరలోనే ఇంటి నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షులు ఆడే వసంత్‌రావు, గ్రామ పటేల్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి : వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-సారంగాపూర్

మద్యం మత్తులో పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణ గ్రామానికి చెందిన రాజుల సాయి(35) భార్య నాలుగు సంవత్సరాల క్రితం విడిచి వెళ్లిపోయింది. తల్లి భోజవ్వతో ఉంటున్నాడు. భార్య లేకపోవడంతో మనస్తాపానికి గురై తాగుడికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి తాగిన మత్తులో పురుగులమందు తాగాడు. వెంటనే నిర్మల్ జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-తలమడుగు

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందారు. మండలంలోని ఉండం-కోసాయి రైల్వేస్టేషన్ మధ్యలో బుధవారం రైలు ఢీకొన్న ప్రమాదంలో 30 ఏండ్లున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఆదిలాబాద్ రైల్వే ఇన్‌చార్జి భోజన్న తెలిపారు. మృతుడిపై బ్లూ కలర్ కోర్ట్, తెలుపు రంగు గీతల షార్ట్, బూడిద రంగు ప్యాంటు ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురికి తరలించామని పేర్కొన్నారు.

11న సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 11న ఉదయం 10 గంటలకు బెల్లంపల్లి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ కోసం సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా సింగరేణి బొగ్గు గని కార్మికుల వేజ్ బోర్డు సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య హాజరవుతారన్నారు. పెన్షన్, రూ.20 లక్షల గ్రాట్యూటీ, సీపీఆర్ఎంఎస్ ఆరోగ్య పథకం, సొంతిల్లు లేని రిటైర్డ్ ఉద్యోగులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని తదితర సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానాలు

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలం తాంసి-కే గ్రామ సమీపంలోని పెన్‌గంగ నది నుండి ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్‌కు జరిమానా విధించామని ఎస్ఐ ఖలీమ్ తెలిపారు. ఈ నెల 5న మహారాష్ట్రకు చెందిన 5 ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న విషయం తెలుసుకొని పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మైనింగ్ శాఖ అధికారులు పోలీస్‌స్టేషన్లో గల ట్రాక్టర్లను పరిశీలించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున మొత్తం రూ.25వేల జరిమానా విధించారు. వాహన యజమానులు జరిమానా చెల్లింపు తర్వాత ట్రాక్టర్లను తీసుకెళ్లారని ఎస్ఐ తెలిపారు.

అబాకస్ జోనల్ లెవల్‌లో విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ-బోథ్

నిర్మల్ జిల్లాలో ఇటీవల జరిగిన అబాకస్ జోనల్ లెవల్ వేదిక్ మ్యాథ్స్ లెవల్ పోటీలు నిర్వహించారు. అందులోని మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాల విద్యార్థులు నిమిష్ రెడ్డి(5వ తరగతి), లాడి హర్షిణి(4వ తరగతి) రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్మల్ జిల్లా ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి బహుమతులు అందజేశారు. వీరికి ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో నిర్వహించే స్టేట్ లెవల్ పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు కిషోర్ తెలిపారు.

రోకండ్ల రమేష్ శ్రద్ధాంజలిలో పాల్గొన్న మాజీ మంత్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రోకండ్ల రమేష్ ఐదవ రోజు శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని బుధవారం జీస్ ఎస్టేట్‌లో నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని ఆయన చిత్రపటం వద్ద పులను సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. రోకండ్ల రమేష్ మరణం పార్టీకి తీరనిలోటని, పార్టీ అభివృద్ధికి తాను చేసిన కృషి ఎన్నడు మరువలేమన్నారు. ఆయన స్పూర్తితో ప్రతి ఒక్క కార్యకర్త ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో విజ్జగిరి నారాయణ, యాసం నర్సింగ్‌రావ్, నవతే శ్రీనివాస్, పండ్ల శ్రీనివాస్, ప్రభాకర్, బట్టు సతీష్, ఉగ్గే విఠల్ ఉన్నారు.

ఖాందేవుని జాతర విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో కొలువైన ఆదివాసీ తొడసం వంశస్థుల ఆరాధ్య దైవం ఖాందేవుని జాతరను విజయవంతం చేయాలని మాజీ సర్పంచ్ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఆదివాసీ నాయకులు తొడసం వంశస్తులు, మండల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగే జాతరలో క్రీడా పోటీలు చేపడతారని, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి భక్తులు వస్తారని వారికీ ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ ఎండీ యూనిస్ అక్బాని, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారుతి, జ్ఞానోబా పుష్కర్, మాజీ జడ్పీటీసీ బిరుజులాల్, జేపీసీ మాజీ చైర్మన్ ఉత్తం రాథోడ్, ఫ్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, రెడ్డి నాయక్, ఏఎంసీ డైరెక్టర్ జాదవ్ కైలాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, తొడసం నాగోరావ్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు దాదారావు, పెసా చైర్మన్ రాథోడ్ సికిందర్, మాజీ ఎంపీపీ మేస్రం రూప్ దేవ్, మాజీ సర్పంచ్ రూప్ దేవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోఖండే దేవరావ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శించిన మాజీ మంత్రి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కన్గుట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యం మృతి చెందింది, బుధవారం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు .కార్యక్రమంలో నాయకులు బండారి శ్రీధర్ రెడ్డి, డాక్టర్ స్వామి మాజీ సదానందం, చిన్నయ్య రూపచంద్, ఇఫ్తాకర్ పాల్గొన్నారు.

భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-కెరమెరి

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై గుంపుల విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసి మాట్లాడారు. రోడ్డుపై నడిచేటప్పుడు, వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించ కూడదన్నారు.హెల్మెట్ వాడకం వలన జరగబోయే ప్రమాదాలను ఎలా అరికట్టవచ్చో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయాలి

నవతెలంగాణ-బోథ్

తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయాలని ఉద్యమకారులు రమణ గౌడ్, దిటి దేవిదాస్ అన్నారు. బుధవారం గ్రామపంచాయతీ ఈఓ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 2001 నుంచి 2014 వరకు ఉద్యమించి జైలుకు వెళ్లడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వం న్యాయం చేసి ఇంటికి ఒక ఉద్యోగంతో పాటు 250 గజాల స్థలం ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే రూ. 25000 గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.